ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

హోం మంత్రి ఇలాకాలో అణచివేత టీం..!



స్వాట్ టీం సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా (ఫైల్)

- వివాదాస్పదమవుతున్న స్వాట్
- కార్మిక ఆందోళనలే లక్ష్యంగా దాడి చేసే ప్రత్యేక బృందం ఏర్పాటు
- సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసులతో స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) టీం ఏర్పాటు వివాదాస్పదమవుతోంది. స్వాట్ ఏర్పాటు చేసినట్లు ఎస్పి తుహిన్ సిన్హా ప్రకటించినప్పటి నుంచీ కార్మికులు, ఉద్యోగులు, కార్మిక, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదుల్లో ఇదొక చర్చనీయాంశంగా మారింది. పారిశ్రామిక ప్రాంతాలు, ఇతర ప్రదేశాలలో ఆందోళనకారులు, నిరసనకారులను అదుపుచేసి, చెదరగొట్టేందుకు ప్రత్యేక్ష శిక్షణ ఇచ్చిన స్వాట్ టీం అవసరం హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్య జిల్లాలో ఎందుకున్న చర్చ సర్వత్రా సాగుతోంది. పాయకరావుపేట నుంచి పరవాడ వరకు విస్తరిస్తున్న పారిశ్రామిక ప్రాంతంలో నేడు స్వాట్ అలజడి సృష్టిస్తోంది. పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలకు భద్రత కల్పించని, పర్యావరణ ప్రమాణాలు పాటించని, పరిశ్రమలకు భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయని కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా కార్మికుల అణచివేతకు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేయడంపై అందరూ మండిపడుతున్నారు.

వాస్తవమేంటి ?

వాస్తవానికి ఇక్కడ స్వాట్ అవసరమే లేదు. కొద్ది రోజుల క్రితం సమాచారం లేకుండా లే ఆఫ్ ప్రకటించి వెయ్యి మంది కార్మిక కుటుంబాలను వీధినపడేసిన అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం చూపిన కనికరం అందులో పనిచేస్తున్న నిర్వాసిత, పేద కుటుంబాల కార్మికులపై చూపలేదు. గత్యంతరంలేని కార్మికులు తమకు జరిగిన అన్యాయాన్ని సిఐటియు నాయకత్వంలో పలువురికి దృష్టికి తీసుకెళ్లారే తప్ప అల్లరి చేయలేదు. రసాయన వ్యర్థాలతో సముద్రంలో వేటపోయిన మత్స్యకారులు ఉపాధిని వెతుక్కొని వలసపోతున్నారే తప్ప ప్రగతికి ప్రతిబంధకంకాలేదు. ఔషధ కంపెనీలకు ఆనుకొనివున్న తాడి ప్రజలు అనారోగ్యాలతో మిగతా 2లో..

స్వాట్‌ను ఉపసంహరించుకోవాలి



కార్మికుల, ప్రజా పోరాటాల అణచివేతకు ఏర్పాటు చేసిన స్వాట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి. సంఘ విద్రోహ శక్తులు, ఉగ్రవాదులపై ఉపయోగించాల్సిన టీంను ప్రజాస్వామిక, కార్మిక హక్కుల కోసం పోరాడే వారిపై ప్రయోగించడం మంచిది కాదు. పారిశ్రామికాధిపతుల దయాదాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడేలా చేయడంతో పారిశ్రామిక పురోగతి సాధ్యంకాదు. కార్మిక హక్కులు, చట్టాలు ప్రభుత్వం అమలుచేయాలి. బడా కార్పొరేట్లు, పెట్టుబడిదారులను సంతృప్తిపర్చే పని మానుకోవాలి.

- జి.కోటేశ్వరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి



29న విశాఖకు ప్రధాని మోడీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఈ నెల 29న ప్రధాని మోడీ ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు విశాఖలోని కేంద్ర కార్యాలయాలకు శుక్రవారం రాత్రి సమాచారం వచ్చింది. తొలుత ఆయన అనకాపల్లి జిల్లా తిక్కవానిపాలెంలోని ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ భూమి పూజలో పాల్గొంటారు. ఆ తరువాత ఉమ్మడి విశాఖలో మరిన్ని కీలక ప్రారంభోత్సవాల్లో ప్రధాని పాల్గొనే అవకాశముందని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా విశాఖ వస్తున్న ప్రధానికి ఘనంగా స్వాగతం పలకాలని సర్కారు భావిస్తోంది.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

వార్త 6లో..

అభిజిత్ కార్మికుల పోరాట విజయం

వార్త 5లో..

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బిర్సా ముండా

వార్త 3లో..

తోపుడు బండ్ల తొలగింపు అడ్డగింత




జెసిబిని అడ్డుకుంటున్న తోపుడు బండ్ల కార్మికులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : వాల్తేరు కోటక్ స్కూల్ రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండ్లను తొలగించేందుకు జివిఎంసి అధికారులు పూనుకోగా సిఐటియు ఆధ్వర్యాన తోపుడు బండ్ల కార్మికులు శుక్రవారం అడ్డుకున్నారు. ఉదయం 10 గంటలకు జోన్ 3 టౌన్ ప్లానింగ్ ఎసిపి ఆధ్వర్యాన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలిసి తోపుడు బండ్లు తొలగించడానికి వచ్చారు. వారి వెంట పోలీసులనూ తీసుకొచ్చారు. ఈ క్రమంలో 15 సంవత్సరాల నుంచి ఇక్కడే తోపుడు బండ్లు పెట్టుకుని తామంతా బతుకుతు న్నామని, తమను తొలగించడం అన్యాయమని పేర్కొంటూ కార్మికులంతా నిరసన తెలియజేస్తూ వారిని అడ్డుకున్నారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం.. ఎక్కడ వ్యాపారం చేసుకునే తోపుడు బండ్ల కార్మికులను అక్కడే బతకనీయాలని ఉన్న విషయాన్ని తోపుడుబండ్ల కార్మిక సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవాధ్యక్షులు పి.వెంకట్రావు గుర్తుచేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ ట్విట్టర్ కంప్లైంట్ ద్వారా చిల్లర వర్తకులను జివిఎంసి అధికారులు తొలగించడం అన్యాయమన్నారు. ప్రొక్లయిన్, లారీలు, సిబ్బందితో వచ్చి బలవంతంగా, మిగతా 2లో..

అభివృద్ధి పనులు వేగవంతం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిసి రోడ్లు, గోకులం షెడ్లు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. ఉపాధి హామీ చట్టంలో మంజూరై నిర్మాణంలో ఉన్న పెందుర్తి మండలం సరిపల్లి, జంగాలపాలెం, పెదగాడి గ్రామ పంచాయతీల్లోని సిసి రోడ్లు, గోకులం షెడ్ల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా సమైఖ్య ప్రాంగణంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, క్లస్టరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అదనపు ప్రోగ్రాం అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో భూమి పూజ చేసి ప్రారంభించబడిన అన్ని సిసి రోడ్లు, గోకులం షెడ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆమోదించి ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని, లేనియెడల ప్రభుత్వం రద్దు చేస్తుందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో మంజూరైన 1142 సిసి రోడ్లు, 851 గోకులం షెడ్లను, విశాఖపట్టణం జిల్లాలో 140 సిసి రోడ్లు, 151 గోకులం షెడ్లను సంక్రాంతికి ముందుగా పూర్తి చేయాలన్నారు. పూర్తి కాబడిన పనులకు పేమెంట్‌నకు ఎఫ్‌టిఒలు జనరేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పథక సంచాలకులు ఆర్.పూర్ణిమాదేవి, విశాఖ జిల్లా నీటి యాజమాన్య సంస్థ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వీరు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న శివప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

హోం మంత్రి ఇలాకాలో అణచివేత టీం..!

మంచంపడుతున్నారేగానీ మరొక చోటకు తరలించి ప్రాణాలు కాపాడాలని పట్టుబట్టి ప్రభుత్వ, ప్రజా ప్రతినిధులను నడివీధుల్లో నడియాడకుండా చేయలేదు. ఎన్ఎఓబి, నక్కపల్లి హెటిరో, పరవాడ ఫార్మా, పాయకరావుపేట డెక్కన్ కెమికల్, అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్ నిర్వాసితుల సమస్యలు దశాబ్దాలుగా నలుగుతున్నా ఏ ప్రభుత్వమూ పరిష్కారంచేయలేదు. విద్యార్హతలు కలిగిన స్థానిక యువతకు పరిశ్రమల్లో మాట ప్రకారం ఉపాధి కల్పించలేదు. 2013 భూ సేకరణ చట్టాన్ని సక్రమంగా అమలుచేయడంలేదు. వీటన్నింటినీ విస్మరించి... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కార్మికులకు జరిగిన నష్టం, విషాదం సరిపోదన్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమానులకు మరింత లాభాలను పోగేసుకోవడానికి అవకాశమివ్వబూనుకుంది. పరిశ్రమాధిపతులకు విశ్వాసం కలిగించి, కార్మికులు, నిర్వాసిత కుటుంబాలు, కాలుష్య ప్రభావిత గ్రామాల ప్రజలను భయపెట్టేందుకు ప్రభుత్వం స్వాట్ టీం ఏర్పాటు చేసినట్లు కనబడుతోందన్న చర్చ ప్రజల్లో సాగుతోంది.



పరిశ్రమల భద్రతపై శ్రద్ధ పెట్టాలి

స్వాట్ కంటే పరిశ్రమలు, కార్మికుల భద్రతపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి. పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

వివిఎస్.కృష్ణ,
మానవ హక్కుల వేదిక
తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు

కట్టుబానిసలుగా మార్చే చర్య



ఎస్ఇజెడ్, ఫార్మా సిటీలో కార్మికుల హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. ప్రైవేటులో ఇప్పటికే కార్మికులకు తమ సమస్యలను చెప్పుకొనే వేదికలేదు. వారికివున్న ఏకైక అవకాశం కార్మిక సంఘాల ప్రతినిధులే. స్వాట్‌తో ఆ అవకాశం లేకుండా చేయాలన్నది ప్రభుత్వ తలంపు. కార్మికులను కట్టుబానిసలుగా తయారుచేయడానికి ప్రభుత్వం తీసుకొనే చర్యలా కనిపిస్తోంది.

రాజాన దొరబాబు, ఎఐటియుసి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

తోపుడు బండ్ల తొలగింపు అడ్డగింత

నోటీసులు ఇవ్వకుండా తోపుడుబండ్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని, జివిఎంసి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. తక్షణం కోటక్ స్కూల్ తోపుడు బండ్లు కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించి వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని జివిఎంసి కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, చిన్న వాల్తేర్ కోటక్ స్కూల్ తోపుడుబండ్లు కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అప్పారావు, కె.రాజు, తోపుడు బండ్లు కార్మికులు పాల్గొన్నారు

తోపుడుబండ్ల తొలగింపును ఆపాలి : సిపిఎం

తోపుడు బండ్ల తొలగింపును ఆపి, చిరు వ్యాపారులకు ఉపాధి రక్షణ కల్పించాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ రహదారిని ఆక్రమించిన బడా వాణిజ్య వ్యాపారులను వదిలేసి చిరు వ్యాపారులపై పడటం తగదన్నారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, పవన్ కల్యాణ్, టిడిపి నేతలంతా ఈ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు.

విసిసి ఆటల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగదాంబ జోన్ పరిధి కొబ్బరి తోట, ఆంథోని నగర్, పందిమెట్ట, బుక్క వీధి ప్రాంతాలలో చిల్డ్రన్స్ డే వేడుకల్లో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీల్లో 80 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, లెమన్ స్పూన్, సైకిల్ రేస్, డ్రాయింగ్, రన్నింగ్ రేస్, క్విజ్ పోటీలను జోన్ ఆర్గనైజర్స్ సరోజ, మణి, జాహ్నవి, జయంత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసరా ఛారిటబుల్ సొసైటీ కార్యవర్గ సభ్యులు శ్రీనాథ్ పాల్గొన్నారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ, రోటరీ క్లబ్, విశ్వమానవ సంక్షేమ సంఘం సహకారం అందించాయని నిర్వాహకులు తెలిపారు.

ఎఐ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్స్ విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎఐ ఎక్స్‌పో - 2024 శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. ఎంపీ శ్రీభరత్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇంటీరియర్ డిజైన్స్ ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి నూతన ఉత్తేజం కలుగుతుందని ఆయన అన్నారు. ఎక్స్‌పోలోని టైల్స్, లైటింగ్స్, వాల్ ఇంటీరియర్ డిజైన్స్ విశాఖపట్నం ప్రజలను ఎంతో ఆకర్షిస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్స్ విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల, కార్యదర్శి రాంజీ ఎ ఉత్తాడ పాల్గొన్నారు.

క్రీడల్లో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు పతకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అసోం రాజధాని గువాహటిలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన 20వ ఆలిండియా బిఎస్ఎన్ఎల్ అథ్లెట్స్ పోటీల్లో నగరంలోని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కె.మీనాకుమారి, జి.ఉమాదేవి పతకాలు సాధించారు. వారిని డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, యూనియన్ నాయకులు సత్కరించి అభినందించారు. 100, 200, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో కె.మీనాకుమారి ప్రథమ స్థానంలో, 100, 200 మీటర్ల పరుగులో జి.ఉమాదేవి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ క్రీడాకారిణిగా మీనాకుమారికి ప్రత్యేక అవార్డు దక్కిందని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పివిసిహెచ్‌వి.సాగర్ తెలిపారు.

ఆస్తి విలువ ఆధారిత పన్నును రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్నును రద్దు చేయాలని కోరుతూ వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లపై వసూలు చేసే ఇంటి పన్ను 2021లో ఇంటి అద్దె విలువ ఆధారిత ఇంటి పన్ను నుండి ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్నుగా మార్చబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంటి పన్నును కాస్త ఆస్తిపన్నుగా మార్చేయడం అన్యాయం, అశాస్త్రీయమని పేర్కొన్నారు.

ఉసిరి, మారేడు, మర్రి మొక్కలు నాటండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఒక్కరూ ఉసిరి, మారేడు, మర్రి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమార స్వామి కోరారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని ఎస్‌వివిపి డిగ్రీ కళాశాలలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం నేతృత్వంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఎపిసిసిఐ ఆధ్వర్యాన జిఎస్‌టిపై సెమినార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఎపిసిసిఐ) ఆధ్వర్యంలో జిఎస్‌టిలోని పలు అంశాలపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఎఫ్‌ఎపిసిఐ అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు, గుంటూరు సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్ ఐఆర్ఎస్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

ప్రాజెక్టులపై సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్. : జిల్లాలో చేపట్టదలిచిన అభివృద్ధి ప్రాజెక్టులపై, భవిష్యత్తు కార్యాచరణపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలిసి వివిధ అంశాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పర్యాటకానికి, పచ్చదనానికి పెద్దపీట వేస్తూ జిల్లాలో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నగరాన్ని అనుసంధానం చేసే ప్రధాన రోడ్లపై దృష్టి సారించాలన్నారు.

తీర ప్రాంత బార్ అండ్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలి



రిలే దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సిఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా తీర ప్రాంతంలో విచ్చల విడిగా నిర్వహిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్‌ల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, ఫిషింగ్ బోట్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పిసి.అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు తదితరులు సందర్శించి మాట్లాడారు. తీరంపై తరతరాలుగా తమకు పూర్తి హక్కులున్నాయని, తమ జీవన విధానం సముద్రంపై ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. తీరాన్ని కబళించి హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టులు ఏర్పాటుచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి బర్రి కొండబాబు, కమిటీ ప్రతినిధులు మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి గరగయ్య, వి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌పిల పాత్రపై 17న సదస్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి సిఆర్‌పి ఫెడరేషన్ ఆధ్వర్యాన 'విద్యా శాఖలో సిఆర్‌పిల పాత్ర' అంశంపై తగరపువలసలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 17 వ తేదీన ఉదయం 10 గంటలకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు జరగనుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె గురువులు, వర్కింగ్ ప్రెసిడెంట్ తవిటి నాయుడు శుక్ర వారం తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని సిఆర్‌పిలను కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, డిఇఒ ప్రేమ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా రాధాకృష్ణ మహోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాగరతీరం గోకుల్ పార్కులో శుక్రవారం రాధాకృష్ణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోకుల్ పార్కులో ఉన్న రాధాకృష్ణుల ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ మాజీ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బి.ఉమాదేవి, ఎఎంసి మాజీ ఛైర్మన్ పిన్నింటి వెంకటరమణ, తాళ్లవలస ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ, టిడిపి నాయకులు కోరాడ రాజబాబు, వైసిపి నాయకులు ము త్తంశెట్టి మహేష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్‌లో శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాల్లో నిష్ణాతులచే నిర్వాహకులు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రాజారావు శుక్ర వారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పొట్నూరు మురళీమోహన్‌రావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, కార్యదర్శి రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో భరత్ ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : సత్య సాయి జిల్లా హిందూపురంలో గత నెల 25, 26, 27 తేదీల్లో జరిగిన ఫుట్ బాల్ పోటీల్లో తమ పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి ఎ భరత్ విశాఖ జిల్లాకు సంబంధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ టీసా మేరీ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థి భరత్‌ను స్కూల్‌లో అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతారని తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బిర్సా ముండా

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : అణగారిన వర్గాల ఆశాజ్యోతి బిర్సా ముండా అని భెల్ ఎజిఎం ఎస్.లీల అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంబేద్కర్ పార్కులో బిర్సాముండా 149వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల పెన్నిధి, గిరిజన జాతుల కోసం నిరంతరం పోరాడారన్నారు. భూమి, నీరు, అడవి కోసం పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి దేముడు, బాబూరావు సుభాకర్ సాహు పాల్గొన్నారు.

దేవరాపల్లి : గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు మండలంలోని వాలాబు, చింతలపూడి గ్రామాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. బిర్సా ముండా చిత్రపటానికి ఎంపీడీవో ఎంవీ.సువర్ణరాజు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దోమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ రావు, హౌసింగ్ అధికారి గోవింద, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వివిఎ.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యాన ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలోనూ, కంచరపాలెంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహం ఆవరణలోనూ గిరిజన పోరాట యోధుడు బిర్సాముండా జయంతి వేడుకలు జరిగాయి. వర్సిటీ ఉపసంచాలకులు డాక్టర్ కృష్ణారావు, వి.వి.పతిరావునాయుడు పాల్గొన్నారు.

దేవస్థానం భూములు స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ పరిధి గుడిలోవ శ్రీ రంగనాథ స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 69 లో 26 ఎకరాల 25 సెంట్లు భూమిని హైకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం స్వాధీనం చేసుకొని శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎన్‌విఎస్.ప్రసాద్‌వర్మ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, దేవాలయ కార్య నిర్వహణాధికారి ఎస్.నానాజీబాబు తదితరులు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన అధికారులు

కెజిబివిని తనిఖీ-చేసిన ఆర్‌జెడి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వసతి గృహం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినుద్దేశించి ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడేలా అర్థవంతమైన జీవితాన్ని గడపాలని, చదువు అందుకు దోహద పడుతుందని చెప్పారు. ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఇఒ ఎం.శివరాణి, కెజిబివి ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు.

'బాలి యాత్రను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి -మధురవాడ : ప్రాచీన కళింగ సీమ సంస్కృతిలో ప్రాముఖ్యత కలిగిన బాలి యాత్రను ఈ నెల 17వ తేదీన శ్రీముఖలింగం పుణ్యక్షేత్రాలను పునరుద్ధరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయ దర్శనం, అనంతరం వంశధార నది తీరాన ప్రత్యేక దీపారాధన ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని కళింగ సంఘాల కుటుంబ సభ్యులు, అన్ని వర్గాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బాలి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గీతం దంత వైద్య విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో 2024-25 విద్యా సంవత్సరానికి బిడిఎస్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.నరసింహారావు, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ మనిష్‌కుమార్, డాక్టర్ సంధ్య, డాక్టర్ నాగజ్రియ హాజరై విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. దంత వైద్యంలో ఉన్న వివిధ విభాగాలను వాటి ప్రాధాన్యతను వివరించారు. స్వీయ ప్రతిభను పెంచుకోవాలని, నైపుణ్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

200 మంది రక్తదానం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆధ్వర్యాన శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ ప్రారంభించారు. దాదాపు 200 మందికిపైగా విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు రక్తాన్ని సేకరించారు. రక్తదాన కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, జిమ్‌సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెట్ డాక్టర్ వసంత కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన 'మాలతాంబ' స్పోర్ట్స్

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం మాలతాంబ విద్యానికేతన్ పాఠశాలలో క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. రన్నింగ్, క్రికెట్, త్రోబాల్, షాట్‌పుట్, ఖోఖో, రిలేరేస్, పిరమిడ్స్, యోగా, కరాటే మార్షల్ ఆర్ట్స్, యుద్ధ కళలు, కల్చరల్ ఈవెంట్స్‌లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. మాలతాంబ విద్యాసంస్థల అధినేత, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి అధ్యక్షతన విద్యార్థులకు బహుమతులను ముఖ్య అతిథులు డిస్ట్రిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జూన్ గేలియాట్, నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐ ఎస్.సాయి, ఎస్ఐ జి.ప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జిపిఆర్.కృష్ణ, ప్రిన్సిపల్ ఎ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపల్ బి.శ్రీదేవి, పీడీ బి.హరీష్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : చెడు వ్యసనాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. నవోదయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవోదయ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ బిశెట్టి రాము, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి దుర్గానగర్, విరాట్‌నగర్ గెడ్డలో చేపట్టిన స్ట్రాంగ్ వాటర్ డ్రెయిన్ కాలువల నిర్మాణ పనులను కార్పొరేటర్ రాపర్తి కన్నా శుక్రవారం పరిశీలించారు. సింహాద్రినగర్‌లో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణపై స్థానిక కాలనీ పెద్దలు వెంకటపతి రాజు, శంకర్రావుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు మేడిశెట్టి అప్పారావు, కోసింకోట అప్పారావు, లక్ష్మి, కోరుకొండ దుర్గారావు, లీల, శీల, రమ తదితరులు పాల్గొన్నారు.

గీతం డేకేర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటైన డే కేర్ సెంటర్‌ను శుక్రవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అజితా వాజండ్ల, విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్‌తో కలిసి ప్రారంభించారు. దాదాపు 55 మంది చిన్నారులను సంరక్షించేలా వివిధ సౌకర్యాలతో ఈ డేకేర్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. బాలల సంరక్షణతో పాటు వారి మానసిక, శారీరక ప్రగతికి ఉపయోగపడేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పోర్టు హాస్పిటల్ టెండర్లు రద్దుచేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇచ్చే టెండర్లను వాయిదా వేయడం కాదని, రద్దు చేయాలని పోర్టు విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జక్కన సత్యనారాయణ డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 46వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి జక్కన సత్యనారాయణ మాట్లాడుతూ, 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, కుటుంబీకులకు సేవలందిస్తున్న ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో 300 పడకల మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా నిర్మాణానికి ప్రయివేట్ వారికి ఇవ్వడాన్ని అన్ని యూనియన్లు వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఈ నెల 18న టెండరు ఓపెన్ చేయడానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రయివేటు చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. ప్రయివేటు యాజమాన్యం సేవలను అందించడం కంటే లాభాల కోసం మాత్రమే పనిచేస్తాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పోర్టులో పిపిపి/బిఒటి విధానాలు విఫలమయ్యాయని గతంలో కాగ్ నివేదికల ద్వారా స్పష్టంగా తెలిసిందన్నారు. పోర్టు హాస్పిటల్ కూడా ప్రయివేటు చేతుల్లోకి వెళ్లిపోతే కార్మికులు, పెన్షనర్ల కుటుంబాలు వైద్య సౌకర్యాల నుంచి దూరమవుతాయని తెలిపారు. ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు రాకుండా, కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత అని, పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు' అని పేర్కొన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని కోరారు. ఈ దీక్షలో సిఐటియు నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్ఎన్.మూర్తి, రాఘవులు, శ్రీనివాసు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న నాయకులు

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన



స్టేడియంలో పనులను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో అభివృద్ధి పనులను జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. అభివృద్ధి పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని అధికారులను ఆరా తీశారు. స్టేడియంలో ఎయిర్ కండిషన్, లైటింగ్, సీసీ సర్వైన్స్ నెట్‌వర్క్ పనులు పూర్తి కావచ్చాయని అధికారులు వివరించారు. కొత్తగా కుర్చీలను అమర్చాల్సి ఉందని తెలిపారు. 1200 మంది వీక్షకులు కూర్చునేందుకు వీలవుతుందని, అన్ని పనులను త్వరితగతిని పూర్తి చేస్తామని వివరించారు. స్టేడియంలో ఎక్కువ మంది వీక్షకులు, క్రీడాకారులు కూర్చునేందుకు వీలుగా మరికొన్ని ఆధునికమైన కుర్చీలను అమర్చాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజును, అదనపు కమిషనర్ డివి.రమణమూర్తిని కమిషనర్ ఆదేశించారు. స్టేడియం గదులలో ఉన్న ఎన్నికల సామాగ్రిని మరొక చోటకు తరలించి, క్రీడాకారుల సౌకర్యం కోసం సిద్ధం చేయాలని కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, సాడి పద్మావతి కమిషనర్‌ను కోరారు. విశాఖ నగరంలో జరుగనున్న జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు, క్రీడాకారులకు సౌకర్యవంతంగా 2025 జనవరి నాటికి స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్టేడియం ఆవరణలో ఉన్న టెన్నిస్ కోర్టును పరిశీలించారు. నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలని స్పోర్ట్స్ డైరెక్టర్ రాజుకు కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఇంజినీర్ పివివి.సత్యనారాయణరాజు, ఎసిపి సిహెచ్.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాంలోని శ్రీవెంకట్ విద్యాపీఠ్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆనందపురం సిఐ చింత వాసునాయుడు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యం ఏర్పరచుకొని చదువుకోవాలని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పాల్గొని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సిఐ ద్వారా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఎంపికైన విద్యార్థులను కోచ్ లెంక అప్పలరాము, విద్యాపీఠ్ డైరెక్టర్ రంగోలి వెంకటేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లెంక రాంబాబు, విద్యా పీఠ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ ఆర్.పద్మ, ప్రిన్సిపల్ ఆర్.సత్యవేణి, నాయకులు అప్పల రాము, శినగం అప్పలరాజు, కోరాడ వైకుంఠం, కె.మూర్తి, గొల్లగాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి భారత నిర్మాణ శిల్పులు

వైస్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నేటి బాలలే, రేపటి భారత నిర్మాణ శిల్పులు అని రియర్ అడ్మిరల్ ఎన్ఎం కమాండ్ స్టాఫ్ ఆఫీసర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.మురళీమోహన్‌రాజు అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం, బాలల దినోత్సవంతో పాటు, 71వ సహకార వారోత్సవాల సందర్భంగా ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మేఘాద్రి పేట కాలనీలో ఏర్పాటుచేసిన విద్య ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధునిక దేవాలయాలుగా కొనియాడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్మించి భారత పరిపుష్టతకు జవహర్‌లాల్ నెహ్రూ అహర్నిశలు కృషి చేశారన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, తమ కలలతో పాటు కన్నవారి కలలను సాకారం చేయాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సొసైటీ అతి తక్కువ వడ్డీకి సభ్యులకు రుణాల అందజేయడంతో పాటు మరణం విపత్కర సహాయ పథకం, మరణించిన సభ్యుల రుణమాఫీ పథకం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు.

7, 10 తరగతులు, ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్, మెడికల్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 105 మంది పిల్లలకు సొసైటీ విద్యా ప్రోత్సాహకాలు అందజేసింది.

గౌరవ అతిథి కమడోర్ అనూప్ జాయ్ మాట్లాడుతూ, దేశంలో సహకార ఉద్యమ ప్రాధాన్యతను, గతంలో సొసైటీ ఎదుర్కొన్న ఆటుపోట్లను అధిగమించి అనేక పథకాల రూపొందించిన తీరును వివరించారు. కేవలం 35 పైసల మార్జిన్‌తో, అత్యంత పారదర్శకతతో సభ్యులు సేవలందిస్తున్న సొసైటీ చరిత్రను రెడ్డి వెంకటరావు, సొసైటీ సూపర్‌వైజర్, కౌన్సిల్ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డిఎస్.మూర్తి, సొసైటీ అధ్యక్షులు విప్లవ్ కుమార్, కార్యదర్శి అంజని రాజేష్, ఉపాధ్యక్షులు మంజు, కోశాధికారి గణేష్ కుమార్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో వైస్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు తదితరులు



మాట్లాడుతున్న కాకి గోవిందరెడ్డి

షీలానగర్ సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి- గాజువాక : షీలానగర్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చెప్పారు షీలానగర్ లేడీస్ క్లబ్ 40వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాలనీవాసులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కాలనీలో కొన్ని సమస్యలు పరిష్కరించానని, ప్రజా ప్రతినిధిగా తమ సహాయసహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. షీలానగర్ అప్ కీపింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, మహిళలందరూ ఐక్యతతో ఉంటే కాలనీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గతంలో హౌస్ ట్యాక్స్‌పై సమైఖ్యంగా పోరాటం చేసి పెరగకుండా చూడగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో షీలానగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిఎస్ఎన్.రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సత్యారావు, సుబ్బరాజు, శ్రీను, లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మి, సెక్రటరీ సాయిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పి.భవాని, ఎన్.శకుంతల, లక్ష్మీరాజు పాల్గొన్నారు.

కవితా చర్చ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నంలోని హిందీ సాహిత్య సంస్థ సృజన్ 22వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆన్‌లైన్‌లో సభ్యులతో ప్రత్యేక కవితా చర్చ కార్యక్రమం నిర్వహించారు. కవిత్వ చర్చ కార్యక్రమాన్ని సీమా వర్మ, సృజన్ అధ్యక్షుడు నీరవ్ కుమార్ వర్మ నిర్వహించారు. డాక్టర్ టి.మహాదేవరావు, కార్యదర్శి సృజన్ కార్యకలాపాలు విజయాలను వివరించారు. కవిత్వ పఠనం చర్చలలో కవులు తమ రచనలను సమర్పించారు.



సీతంరాజు సుధాకర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ విల్లూరి తదితరులు

సీతంరాజు సుధాకర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్‌టిఆర్ వైద్య సేవ ఛైర్మన్‌గా నియమితులైన సీతంరాజు సుధాకర్‌ను కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు ప్రెసిడెంట్ బొత్స రాము ఆధ్వర్యాన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు.



నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

'విశాఖ'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పెందుర్తి : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళూరుకు చెందిన రైనెక్స్ టెక్నాలజీ కంపెనీ ప్రాంగణ ఎంపికలు చేపట్టింది. కళాశాలకు చెందిన బి.టెక్, ఎంసిఎ విద్యార్థులు 53 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ పి.ప్రదీప్‌వర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ మెంబర్లు డాక్టర్ కాసర్ జోహ్నా, ఎండికె.శరణ్య, ఎమ్.సుదీప్తి, వివాధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అభిజిత్ కార్మికుల పోరాట విజయం

- 18లోపు బోనస్ చెల్లించడానికి యాజమాన్యం హామీ
- గడువు ప్రకారం హామీలు అమలు చేయకపోతే పోరాటం
- సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి అచ్యుతాపురం

సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ కార్మికులు విజయం సాధించారు. అక్టోబర్ 13న చట్ట విరుద్ధంగా యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించడంపై సిఐటియు నేతృత్వంలో కార్మికులు వివిధ రూపాల్లో పోరాటం నిర్వహించారు. సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ యంత్రాంగంపై కార్మికులు పోరాటాలతో ఒత్తిడి పెంచారు. కార్మికులను చీల్చాలని కొంతమంది చేసిన ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొట్టారు. మొండికేసిన యాజమాన్యం కార్మికుల పోరాటంతో చివరకు చర్చలకు వచ్చింది. దువ్వాడలోని విఎస్ఇజెడ్ ప్రధాన కార్యాలయంలో గురువారం విఎస్ఇజెడ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమ్య సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఈనెల 18లోపు కార్మికులకు బోనస్ చెల్లించడానికి, నెలాఖరునాటికి చెల్లించాల్సిన గ్రాట్యూటీ వివరాలు తెలియజేయడానికి, ఐదేళ్లు దాటిన కార్మికులందరికీ గ్రాట్యూటీ ఇవ్వడానికి, పరిశ్రమను తెరిచినప్పుడు కార్మికులందరినీ యథాతథంగా విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్య ప్రతినిధులు అంగీకరించడంతో చర్చలు ఫలప్రదమయ్యాయి. చర్చల్లో యాజమాన్య ప్రతినిధులు జిఎం నాయుడు, కిషోర్, చిన్నారావు, లేబర్ కాంట్రాక్టర్లు ఎం.వెంకటరమణ, లావణ్య, కిషోర్, కార్మికుల తరపున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, నర్సింహమూర్తి, రమణ, ఎంఎం నాయుడు పాల్గొన్నారు.

చర్చల్లో జరిగిన విషయాలను శుక్రవారం అభిజిత్ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము కార్మికులకు వివరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాడిన ఫలితంగా డిమాండ్లు సాధించుకున్నారని తెలిపారు. చర్చల్లో ఇచ్చిన హామీలను గడువు ప్రకారం అమలు చేయకపోతే పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు యాజమానులకు లాభదాయకంగా, కార్మికులకు నష్టంచేసేలా వున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయకుండా ప్రత్యేక పోలీసు దళాలను ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు డి శ్రీనివాసరావు, మత్స్య కార్మిక సంఘ నాయకుడు చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు

18న ఆశా వర్కర్ల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 18న కలెక్ట్ ఆఫీసు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.శాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి మాట్లాడారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనల ఫలితంగా నాటి రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు సమస్యలు పరిష్కారానికి గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్‌తో సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. అందులో రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంపు, ఆశా వర్కర్లు చనిపోతే కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సర్వేలకు సంబంధించిన పుస్తకాలు తదితర అంశాలతో ఒప్పందం జరిగిందని తెలిపారు. వీటిని అమలు చేయాలన్నారు. సబ్ సెంటర్లో డ్యూటీలు వేయడం ఆపాలని, సర్వేలకు సంబంధించి సర్వే ఫారాలు అందరికీ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి జిల్లా కోశాధికారి సూర్యలక్ష్మి, మంగ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి శిక్షణకు ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డిఎస్‌సి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి అర్హులైన ఫాకల్టీ నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మెగా డిఎస్‌సి ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఈబిసి కులాలకు చెందిన డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తుచేసుకొనే అభ్యర్థులు బిఎడ్, పిజి, విద్యాఅర్హతలు కలిగి ఉండాలని, అనుభవజ్ఞులైన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. దరఖాస్తులను డోర్ నెంబర్ 10-06-31/7, రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజ్ స్ట్రీట్, అనకాపల్లి, చిరునామాలో గల కార్యాలయానికి ఈ నెల 18వ తేదీ లోగా అందించాలని కోరారు. ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 8247036596, 9885845743 లలో సంప్రదించాలన్నారు.

సమ్మె కాలపు జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై గత సంవత్సరం డిసెంబర్లో చేపట్టిన 21 రోజుల సమ్మె సందర్భంగా సమ్మె కాలపు జీతాలను వెంటనే విడుదల చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడుకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డిఈఓ మాట్లాడుతూ సమ్మె కాలపు జీతం బిల్లు సంతకం చేసి బ్యాంకుకు పంపించినట్లు తెలిపారు.

పట్టణంలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు కాళ్ళ తేలయ్యబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గుండాల వీధి, లక్ష్మీదేవి పేట, రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల వారు ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, దోమలు నివారణ చర్యలు తీసుకోవాలని, రోడ్లు నిర్మించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి అచ్యుతాపురం

భారీగా పెరిగిన అన్నింటి ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై ప్రజా పోరు ముగింపులో భాగంగా అచ్యుతాపురం తహశీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అదజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అచ్యుతాపురం సిపిఎం కన్వీనర్ ఆర్ రాము, సభ్యులు కర్రి అప్పారావు, కె.సోమునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చేపల తాతయ్య, ఆర్.లక్ష్మి, ఎస్.రామునాయుడు, బుద్ధ రంగారావు, ప్రజలు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పోరు ముగింపు సందర్భంగా మండల తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేసి, వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ కొత్తపట్నం నుండి వెంకటాపురం జంక్షన్ వరకు ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని, ఫార్మా పొల్యూషన్ అరికట్టాలని, మత్స్యకారులకు వేట నిషేధ కాలం పరిహారం వెంటనే చెల్లించాలని, ఎన్ఏఓబి పెండింగ్ ప్యాకేజీలన్నీ తక్షణమే అందించాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, గ్రామాలలో తాగునీరు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పించాలని, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.నారాయణరావు, చందక రామకృష్ణ, ధోని కాసియా, చోడిపల్లి అప్పలరాజు, గంగరాజు, యు అప్పారావు, వెంకు నాయుడు, ఎం లోవరాజు, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.



మాడుగులలో ధర్నా చేస్తున్న దృశ్యం

మాడుగుల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ప్రజా పోరులో భాగంగా తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.భవాని, వి.మాడుగుల మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ విచ్చల విడిగా ఏర్పాటు చేసిన మద్యం షాపులు మూసివేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని, పాడి రైతులకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్రా చనరాజు, చెదల కృష్ణ, కోర్రా ఈశ్వరరావు, కోర్రా రాజుబాబు. తదితరులు పాల్గొన్నారు.

భోగలింగేశ్వర ఆలయ చైర్మన్‌గా కాండ్రేగుల



ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీ భోగలింగేశ్వర ఆలయ చైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ) నియమితులయ్యారు. ధర్మకర్తలుగా మల్ల సూరిబాబు, పెంటకోట గణేష్ కుమార్, మద్దాల నారాయణరావు, దూలం సత్యవతి, రాపేటి నాగ సంతోష్‌ను నియమించారు. కాండ్రేగుల సత్యనారాయణ టిడిపి ఆవిర్భావం నుండి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. తనను ఆలయ చైర్మన్‌గా నియామకం చేయడంతో ఎమ్మెల్యే రామకృష్ణకి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

నాటుసారా తయారీదారులపై బైండోవర్

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కోరువాడ గ్రామంలో నాటుసారా తయారీదారులు, అమ్మకందారులు 25 మందిని ఎక్సైజ్ పోలీసులు గుర్తించి కె.కోటపాడు తహశీల్దారు బైండోవర్ చేశారు. నాటు సారా తయారు చేసినా, అమ్మకం చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కెవి పాపునాయుడు మాట్లాడుతూ నాటు సారా అమ్మకం చేసినా, తయారు చేసినా కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నాటు సారాయి తాగడం వలన కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ చీపురుపల్లి అచ్చిబాబు, సర్పంచ్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

పోక్సో కేసులపై సమీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, బాలికల మిస్సింగ్ కేసులపై ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. అనకాపల్లి జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. ఆధునిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల అనుసంధానంతో కోర్టులలో నేరాభియోగ పత్రాలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్‌పిలు ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ మూర్తి, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-మునగపాక : గ్రామంలో సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు అన్నారు. స్థానిక దళిత కాలనీలో గల హ్యాండ్ బోర్ చెడిపోవడంతో శుక్రవారం కొత్త హ్యాండ్ బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు మెంబర్లు ఎల్లపు హైమావతి, ముల్లేటి గోవిందరావు, ఆడారి ఉదయ్, ఎల్లపు రాజేశ్వరరావు, కనిశెట్టి వరాహ నూకరాజు, బొడ్డెడ ఆదిరాజు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-0సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, సంకల్ప కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు గవర అప్పారావు మాట్లాడుతూ వంద రూపాయలు రుసుముతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బర్నికాన సాయినాథరావు, గవర సత్యనారాయణ, ఈపు అప్పలరాజు, గవర అప్పల నాయుడు, రాపర్తి బాబురావు, గవర వెంకునాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. డ్రైనేజీల్లో పూడికలు తీయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరావు, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, టిడిపి నాయకులు సందిన సునీల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మురికి కాలువలను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్ళుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించిందని, చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహ అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల అనుమతిలేకుండా నివాస గృహాలకు మీటర్లు బింగించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ప్రజలు అడ్డుకున్నారని, జిల్లాలో ఎక్కడా స్మార్ట్‌మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని సిపిఎం పిలుపునిస్తోందని తెలిపారు.

వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించి, నేడు మీటర్లు బిగిస్తుండం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. అదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కై వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై ఆర్థిక భారం పెరుగుతుందని, ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారన్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసిపి, నేడు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ట్రూ అప్ చార్జీల భారం వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పునరాలోచన చేసి అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేసి స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు ప్రతిఘటించాలని, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని, స్మార్ట్ మీటర్లు ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

18 నుండి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక శ్రీగురజాడ అప్పారావు డిగ్రీ కాలేజీలో ఉచిత కంప్యూటర్ ట్రైనింగ్‌కు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుండి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16న శనివారం సాయంత్రం 5 గంటల లోపుగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బ్యాచ్‌కు 30 మందికి అవకాశం ఉందని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో పాటు డిప్లమోలో ఉత్తీర్ణత సాధించిన వారు కూడా దీనికి అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎం ప్రసన్నకుమార్ 8142565416 నెంబరును సంప్రదించాలని కోరారు.

నాగజగదీష్‌ను కలిసిన ప్రగడ

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నాగజగదీష్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. నాగజగదీష్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు తనకు సహకరించి అన్ని విధాల తనను ప్రోత్సహించారని ప్రగడ తెలిపారు.

కామర్స్‌లో అనురాధకు మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్ర యూనివర్సిటీ స్థాయిలో కామర్స్‌లో ప్రథమ స్థానం సాధించిన స్థానిక దాడి వీరునాయుడు కళాశాల విద్యార్థి పెంటకోట అనురాధకు డాక్టర్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయు మెడల్, ప్రశంసా పత్రం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ కళాశాలకు యూనివర్సిటీ స్థాయిలో అత్యున్నత పురస్కారాలు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ దయామాధురి పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.25 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో కళ్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.25 లక్షలు మంజూరైనట్లు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు కాలనీలోని గతంలో దళితులకు కేటాయించిన ఖాళీ స్థలాన్ని ఆయన సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు.కార్యక్రమంలో కొల్లి ఈశ్వరరావు, అల్లు అబద్ధం, గుల్లిపల్లి మురళి, బండారు అప్పలనాయుడు, గవిరెడ్డి సింహ, వంజంగి సూర్యనారాయణ, అంబేద్కర్ యూత్ సంఘ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

సముద్రంలో చేపలు, తాబేళ్లు మృత్యువాత

- పూడిమడక తీరంలో మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఈజెడ్ పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయనక వ్యర్థ పదార్థాలు కారణంగా సముద్రంలో చేపలు, తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. పూడిమడక తీరానికి శుక్రవారం చనిపోయిన చేపలు, రెండు తాబేళ్ల మృతదేహాలు కొట్టుకొచ్చాయి. వీటిని చూసిన మత్స్యకారులు తీరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతపురం డివిజన్ సభ్యుడు చేపల తాతయ్య మాట్లాడుతూ పరిశ్రమలు రావడంతో తమ జీవనాధారమైన చేపల వేట సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా ఉత్పత్తి అవుతున్న మత్స్య సంపద తమ కళ్లెదుటే అంతరించిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో మత్స్యకారులు ఉన్నారని తెలిపారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవుడు, కొర్లయ్య, పాల్గొన్నారు.



చనిపోయిన చేపలు, తాబేళ్లు వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ ?

మాజీ డిప్యూటీ సిఎం బూడి, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ముత్యాలనాయుడు, ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా? అని మాజీ డిప్యూటీ సీఎం, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బిజెపి సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ఓట్లు వేయించుకొని, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయన్నారు. తల్లికి వందనం, రైతు పెట్టుబడి సాయం, మహిళలకు రూ.1500, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం వంటివి హామీలు నేటికీ అమలు చేయకపోగా, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో వాటికి ఊసే లేదన్నారు. ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపైనా, ముఖ్యంగా వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపైనా కేసులు పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకుంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసిలు దొండ రాంబాబు, మారిశెట్టి విజయ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, వైసిపి నాయకులు వేంపల్లి ఆనంద్ ఈశ్వరరావు, బొడ్డేటి సూర్యనారాయణ, పినబోయిన అప్పారావు యాదవ్, దన్నిన వెంకట్రావు, బూరే బాబురావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

వేతన బకాయిలు చెల్లించాలని

ప్రజాశక్తి-కె.కోటపాడు

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపిడివోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఇ.నాయుడుబాబు, గండి నాయనబాబు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పది నెలల నుండి జీత భత్యాలు చెల్లించలేదని, దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీలలో రూ.6000, మైనర్ పంచాయతీలలో రూ.3000 వేతనాలు చెల్లిస్తున్నారని, జీవో నెంబరు 57 ప్రకారం పంచాయతీ కార్మికులందరికీ రూ.10వేలు చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకి నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా, పంచాయతీ కార్మికులు జీతాలు పెంచడం లేదని, పైగా ఇస్తున్న అరకొర వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదని పేర్కొన్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయితీ పారిశుధ్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎర్ర దేవుడు, వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తాగునీటి పైపులకు మరమ్మతులు

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి భవనం వీధిలో శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ట్యాప్‌లు సరిచేస్తూ మంచినీటికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. నిత్యం సమస్యలు తలెత్తుతూ ఏదో ప్రాంతానికి నీరు అందడం లేదు. విద్యుత్ సమస్య, మోటార్లు కాలిపోవడం, పైపు లైన్లు పగిలి పోవడం, ట్యాప్‌లు విరిగిపోవడం ఇలా ప్రతి నిత్యం ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటన్నిటినీ అధిగమిస్తూ మున్సిపాలిటీ వార్డుల్లో ఇంజనీరింగ్ సిబ్బంది రిపేరు పనులు చేపట్టారు. మున్సిపాలిటీ ఏఇ సుబ్బారావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను అన్ని వార్డుల్లో శాస్త్రీయంగా పరిశీలించి రిపోర్టులు పంపుతున్నామని చెప్పారు. త్వరలోనే భారీ మంచినీటి ప్రాజెక్టుతో పాటు భూగర్భ డ్రైనేజి సిస్టం కూడా రాబోతోందన్నారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

ప్రజాశక్తి-చోడవరం : గంజాయి కేసులో పట్టుబడిన ఐదుగురు ముద్దాయిలకు చోడవరం 9వ అడిషనల్ కోర్టులో సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.రత్నకుమార్ ఒక్కొక్కరికి పది సంవత్సరాలు చొప్పున కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. 2015వ సంవత్సరంలో అక్రమంగా 120 కేజీలు గంజాయి రవాణా చేస్తూ చీడికాడ మండలం జైతవరం గ్రామం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై గంజాయి తరలిస్తున్న చీడికాడ మండలం బయలుపూడికి చెందిన జాజిమొగ్గల సంతోష్, వద్దాది రమణ, పెదబయలు మండలం కిముడుపల్లి గ్రామానికి చెందిన సీదర్ల సుబ్బారావు, చింతాడ లక్ష్మయ్య, కొర్రా బాబురావును అరెస్టు చేసి నాటి చీడికాడ ఎస్సై డి విశ్వనాథం కేసు నమోదు చేశారు. ఈ కేసు వాదనలను విన్న అనంతరం న్యాయమూర్తి ముద్దాయిలకు శిక్షణ ఖరారు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు వాదించారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం మంగళాపురం గ్రామంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధ్వరంలో ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 35 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 14 పశువులకు చూడి పరీక్షలు, 30 పెయ్యలకు నట్టల నివారణ మందు, 32 పశువులకు సాధారణ చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ సహాయకులు బి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దూడ పెయ్యాల మరణాలు అరికట్టే పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 50 మంది మినరల్ మిక్చర్ పాకెట్లు, లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పత్తి కృష్ణ, పత్తి రామారావు, తుంపాల కన్నం నాయుడు, కశింకోట మాణిక్యం, పాల సంఘం అధ్యక్షులు జొన్న సూరిబాబు, పశు వైద్యాధికారి డాక్టర్ కె.వాత్సవి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.భాను, డాక్టర్ గణేష్, డాక్టర్ అచ్యుతరామ్, చోడవరం ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.రవిచంద్ర, పశు సంవర్ధక సహాయకులు మణికంఠ, భాను, శిరీష, మల్లేశ్వరరావు, సీతారాం, గోపాలమిత్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ 14వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆరిపాక చెరుకు కాటా వద్ద ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం 14వ వార్షిక మహోత్సవం ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసిపి నియోజవర్గ నాయకులు గండి రవికుమార్, వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్ బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి మహిళా కోలాట పోటీలను అదీప్ రాజ్ ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్య కుమారి రామునాయుడు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, కర్రి బాబు, డి శ్రీనివాసరావు, మళ్ల బాలాజీ, బొడ్డేటి మహాలక్ష్మీ నాయుడు, యడ్ల నాయుడు, సబ్బవరపు దేముడుబాబు, గొర్లి అప్పారావు, బండారు వెంకటరమణ, బుద్ధ నరసింహమూర్తి, నిమ్మల సత్యానారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు



కోటవురట్లలో హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొం దుతుందని గ్రంథాలయ అధికారులు జనార్ధన్, గోవిందేశ్వరరావు తెలిపారు. నక్కపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు, చినదొడ్డిగల్లు గ్రంథాల యంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో శుక్రవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు.

నర్సీపట్నం టౌన్ : శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ చిన్నారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాద్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

కోటవురట్ల: గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకుని విజ్ఞానాన్ని సముపార్జించాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు నర్సింగరావు మాస్టారు అన్నారు.గ్రంథ పాలకులు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు యుటిఎఫ్ నుంచి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:స్తానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సంరద్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన, గ్రంథాలయాలు, ప్రయోజనాలపై డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయురాలు రమణమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సబ్బవరం ఎస్ఐ టి.దివ్య దీనిని ప్రారంభించారు. గ్రంథాయాధికారి వి.శిరీష కుమారి, వంగలి పాఠశాల టీచర్ పాని, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. వీటిని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న ప్రారంభించారు. గ్రంథాల యాధికారి వరలక్ష్మి, అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో గురజాడ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ పి.విశ్వేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. పుస్తక ప్రదర్శనలో కాంపిటేటివ్ బుక్స్, పురాణ గ్రంథాలు, డిక్షనరీలు, చిన్నపిల్లల పుస్తకాలు డిస్ప్లే చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిఫెన్స్ అకౌంట్స్ ఆఫీసర్ ఇవటూరి సాంబశివరావు, షేక్ అబ్బుల్లా, గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. శాఖ గ్రంథాలయ అధికారిని ఎం పద్మావతి. విశ్రాంతి అటెండర్ రమణమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బుచ్చయ్యపేట : బుచ్చెయ్యపేట శాఖా గ్రంథాలయంలో రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.కృష్ణారావు అన్నారు. జాజిమొగ్గల హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల శాఖ గ్రంథాలయంలో రెండో రోజు కార్యక్రమంలో అమరావతి కథలు పుస్తకాన్ని కేకే జగన్మోహన్రావు పరిచయం చేశారు. రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆళ్ల గోవిందరావు, పీలా కనక వెంకటనారాయణరావు మాట్లాడారు. ఆడారి గోవిందరావు, లైబ్రేరియన్ కే శ్రీనివాసరావు, శివాజీరావు పాల్గొన్నారు.పుస్తక పఠనంతో మేధోసంపత్తి అభివృద్ధి చెందుతుందని స్థానిక సబ్ జైల్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ అన్నారు. పట్టణంలోని శాఖ వీధి ప్రభుత్వ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రోగ్రామ్ చైర్మన్ బల్లా నాగ భూషణం, గ్రంథాలయాధికారి కె శ్రీనివాసరావు, రిటైర్డ్ లెక్చరర్ ఇమ్మిడి శెట్టి చక్రపాణి, విశ్రాంత గ్రంథాలయాధికారి కొణతాల రామారావు, విశ్రాంత అధ్యాపకులు శాస్త్రి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎస్.మహేష్ అధ్యక్షతన పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

గాజువాక : పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పివి.రమణ ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విశాఖ విమల విద్యాలయం, నడుపూరు జెడ్పిహెచ్ఎస్, లైఫ్ వే, ట్రింకిల్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు బి.బాలప్రసాద్, మనోహర్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గోపాలపట్నం ఎస్ఐ వి.అప్పలనాయుడు మాట్లాడుతూ, పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి నరసింహులు, ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎంఎన్వి.శ్రీనివాసరావు, విశ్రాంత తహశీల్దార్ తిరుపతి సాయిప్రకాష్ పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఎంఇఒ వెంకటరావు ప్రారంభించారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయా ధికారి వి.అజయ్కుమార్, రచయిత సత్తిరాజు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం గ్రంథాలయం పుస్తక ప్రదర్శను సహకార సంఘం మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు ప్రారంభించారు. లైబ్రేరియన్ డివిఎస్ అప్పారావు, కొట్యాడ లక్ష్మణమూర్తి, బిసి హాస్టల్ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గోపాలపట్నం ఎస్ఐ వి.అప్పలనాయుడు మాట్లాడుతూ, పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహులు, ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎంఎన్వి.శ్రీనివాసరావు, విశ్రాంత తహశీల్దార్ తిరుపతి సాయిప్రకాష్ పాల్గొన్నారు.



జోరుగా సాగుతున్న పనులు

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ గ్రామానికి సుమారు కోటి రూపాయలు నిధులను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించగా అందులో భాగంగా శుక్రవారం నుండి వీదుల్లో ఏళ్ల తరబడి మట్టి రోడ్డులతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం సీసీ రోడ్డుకు శ్రీకారం చుట్టింది.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -రావికమతం కేన్సర్ వ్యాధి పట్ల ప్రజలందరూ చాలా అప్రమత్తంగా ఉండాలని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ అన్నారు. మండలంలో తట్టబంద గ్రామములో క్యాన్సర్ వ్యాధి పట్ల ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, వైద్య సిబ్బంది సచివాలయ పరిధిలో ఉన్న కుటుంబాలకు వచ్చి ఫిజికల్ ఎగ్జామినేషన్, దీర్ఘకాలికంగా ఉన్న వ్యాధుల వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. ఈ విషయమై ప్రజలందరూ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ, ఎంఎల్‌హెచ్‌పి హైమా, ఎఎన్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

20న నాతవరం మండల సమావేశం

ప్రజాశక్తి- నాతవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి అధ్యక్షతన వహిస్తారని ఆమె అన్నారు.మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.



పరిశీలిస్తున్న అధికారులు

నర్సరీ సందర్శన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఫారెస్ట్ డిపోలో ఉన్న సోషల్ ఫారెస్ట్రీ నర్సరీని కాన్సర్వేటర్ అఫ్ ఫారెస్ట్స్ అడిషనల్ ప్రిన్సిపాల్ చీఫ్ రాహుల్ పాండే సందర్శించారు. నర్సరీలో మొక్కలను చూసి సంతృప్తి వ్యక్త పరిచారు. ఆయనతో వైజాగ్ కన్సర్వేటర్ మహమ్మద్ దివాన్ మైదీన్ , డీఎఫ్ఓ లక్ష్మణ్, సామ్యూల్ ,రేంజ్ ఆఫీసర్స్ సుబ్బారావు, ఫారెస్టర్ భాగ్య లక్ష్మి తదితరులు ఉన్నారు

ఉపాధి హామీ నిధులతో పశుగ్రాసం సాగు

ప్రజాశక్తి కోటవురట్ల:ఉపాధి హామీ విధులతో బహు వార్షిక పశు గ్రాసాల సాగును సద్వినియోగించు కోవాలని ఏపీవో నాగరాజు అన్నారు. 10 సెంట్ల నుండి 50 సెంట్ల వరకు సాగు చేసుకోవచ్చన్నారు. ఒక్కో రైతుకు 50 సెంట్లుగాను రెండు సంవత్సరాలకు రూ.14,250, ఎరువులు పశుగ్రాస కణుపులు కొనుగోలు కు రూ. 11788 కలిసి రెండు సంవత్సరాలకు రూ.26038 బిల్లులు చెల్లిస్తే ఉపాధి హామీ నిధుల నుంచి రైతు పేరుతో జమ చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులకు వ్యవసాయ బోరు నిమిత్తం సొంత భూమి కలిగి ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



రావికమతంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపమాక, గొడిచర్ల, పాటిమీద గ్రామాల్లో శివాలయాల్లో పరమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపారాధన చేశారు.

నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీలో బలిఘట్టం ఉత్తర వాహిని తీరమందు భక్తులు పుణ్యస్నానాలు చేసి బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు ఘనంగా పూజలు, పాలాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. శివాలయ సమీపంలో త్రిశూల పర్వతంపై ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచల మాదిరి కృత్తిక అఖండ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి దర్శనం చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

రావికమతం:మండలంలో చినపాచీల గ్రామంలో లక్ష్మీ సత్యనారాయణ స్వామి, కోదండ రామాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి వెంకట రామ గోపాలచార్యులు ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు . శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

యలమంచిలి : స్థానిక కొత్తపేట రామాలయంలో కార్తీక మాసమంతా కార్తీక పురాణ శ్రవణం జరుగుతుందని గురువు సోమయాజులు విలేకర్లకు శుక్రవారం తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 7.15 నుంచి రాత్రి 8.15 వరకు పురాణ శ్రవణం జరుగుతుందన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కశింకోట : మండలంలోని నరిసింగబిల్లి గ్రామంలో సాంబమూర్తి స్వామి ఆలయంలో దేవాంగులు సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురష్కరించి శుక్రవారం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యర్ర జ్యోతి కుమార్, గ్రామ సర్పంచ్ కొన అరుణ నాగేశ్వరరావు, టీడీపి గ్రామ నాయకులు నూకినాయడు పాల్గొన్నారు.

చీడికలో గ్రామసభ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గిరిజన గ్రామమైన చీడికలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభి యాన్ పథకంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో డి.సీతారామరాజు గ్రామసభ నిర్వహించారు. గిరిజన సమాజానికి బిర్సా ముండా చేసిన సేవలను స్మరించుకుంటూ గిరిజన గౌరవ దినోత్సవం జరిపారు. గిరిజన, అటవీ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహరాజు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



దుస్తులు ఇస్తున్న రామమూర్తినాయుడు

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని మండలం కొమరవోలు జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు అదే పాఠశాల పిటి ఉపాధ్యాయులు రాజులమ్మ అభ్యర్థన మేరకు విద్యార్థులకు కొమరవోలు హెల్పింగ్ యూత్ అధ్యక్షులు సామిరెడ్డి రామమూర్తినాయుడు 20 మంది స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పిల్లలందరూ కూడా బాగా చదువుకొని ఆటల పోటీలో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్, మెంబర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-గొలుగొండ:మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రామారావు తెలిపారు. రోలుగుంట మండలం కంచుగుమ్మల గ్రామానికి చెందిన నక్క దేవి(24) తల్లి స్వగ్రామమైన గొలుగొండ మండలం అమ్మపేటకు గత నెల 27న వచ్చిందన్నారు. ఆమె ఈ నెల 13 ఉదయం 7 గంటలకు అమ్మవారి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. అప్పటి నుంచి ఈమె ఆచూకీ తెలియలేదన్నారు. దీనిపై తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆచూకి తెలిస్తే ఫోన్: 9440904215 నెంబరుకు తెలియజేయాలన్నారు.

ఊడిపడిన పంచాయతీ భవనం స్లాబ్ పెచ్చులు

- పరుగులు తీసిన సిబ్బంది



ఊడి పడిన పెచ్చులు

ప్రజాశక్తి -కొత్తకోటరావికమతం మండలంలో కొత్తకోట పంచాయతీ కార్యాలయ భవనం శిధిలా వ్యవస్థకు చేరింది. శుక్రవారం భవనం లోపల భాగంలో స్లాబ్ పెచ్చులు ఊడి పడటంతో సిబ్బంది ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది తో పాటు మూడు సచివాలయాలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో సచివాలయ భవనాలు నిర్మాణంలో ఉండగా ఆ సిబ్బంది ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.శుక్రవారం ఆకస్మికంగా జరిగిన ఈ సంఘటనతో సిబ్బందిలో భయం ఏర్ప డింది. గత 30 ఏళ్ళు కిందట నిర్మించిన ఈ భవనం కావడంతో నేడు శిథిలావస్థకు చేరింది. భవనంలో సర్పంచ్ గది తో పాటు సిబ్బంది విధులు నిర్వహించే గదులు పూర్తిగా శిదిలం అయ్యాయి. వర్షం పడితే మరింత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ కార్యాలయంలో తాము విధులు నిర్వహించలేమని సచివాలయం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.. దీనిపై సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ ఈవో జ్యోతేశ్వర రెడ్డి స్పందించారు. కార్యాలయానికి మరమ్మతులు చేపట్టే వరకూ మరో చోటు కు మార్పు చేసేందుకు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు..



శిథిలావస్థలో ఉన్న కార్యాలయం



మాట్లాడుతున్న సిఐ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ

ప్రజాశక్తి-గొలుగొండ:సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, యువత మంచి బుద్దులతో మెలిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. సెల్ ఫోన్ల వాడకంను తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.తారకేశ్వరరావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మంగరాజును సన్మానిస్తున్న నాయకులు

డైరెక్టర్ మంగరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:గవర కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన ఆళ్ల మంగరాజును శుక్రవారం గౌరీ సంఘం నాయకులు, యువకులు ఇందిరా మార్కెట్ వద్ద సన్మానం చేశారు. తెలుగుదేశం పార్టీ లో సాధారణ కార్యకర్తగా సేవలందిస్తూ పార్టీ బలోపేతానికి పనిచేసిన మంగరాజును గుర్తించి శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పదవి ఇచ్చారని గౌరీ సంఘం నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ మంగరాజు మాట్లాడుతూ, గవరల సమస్యలు తీర్చడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సంఘం నాయకులు మల్ల నాగేశ్వరరావు, బొడ్డేటి శ్రీను, మల్ల రామకృష్ణ , రవి , గిరి, చిన్న, మల్ల పృథ్వీరాజ్, నరేంద్ర, రోహిత్, లోకేష్, గవర సంఘం నాయకులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు క్విజ్ పోటీలను నిర్వహించడంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పురాణ, ఇతిహాసాలులో అంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్, గణితం వంటి వాటిపై క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సీతారామయ్య, అచ్యుతరావు, సీతారామమూర్తి, తేజోమూర్తుల వేంకటేశ్వరరావు, వాసుదేవరావు, యోగా గురువు ప్రసాద్ పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహాలు వీడాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ప్రజలు మూర్ఛ వ్యాధి పట్ల వున్న అపోహలు, అనుమానాలు తొలగించుకోవాలని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చి రాజు కోరారు.శుక్రవారం ఆంధ్రా మెడికల్ కళాశాల లో జరిగిన సిఎంఈ కార్యక్రమంను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో 2 శాతం ప్రజలు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిపారు.బాధితులు పట్ల కుటుంబ సభ్యులలో మూడ నమ్మకాలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ వ్యాధికి రెండు దశాబ్దాలుగా 30 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మాట్లాడుతూ, మూర్ఛ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు.ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.ఎ.వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మూర్ఛ వ్యాధి నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కెజిహెచ్ న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ, మూర్ఛ వుంటే వివాహం చేయకూడదని అనుకుంటారని, ఇది అపోహ మాత్రమే అన్నారు. ఈ వ్యాధిని 21 రోజుల్లో నయం చేసే మందులు వున్నాయని,వంశ పారంపర్యంగా కూడా వస్తుందని చెప్పారు.కొత్త మందులు వచ్చాయని, రెండు సంవత్సరాలు మందులు వాడాల్సి ఉంటుందన్నారు. న్యూరో సర్జరీ డాక్టర్ ప్రేమ్ జిత్ రే, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయం



రక్తదాన శిబిరంలో కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:అత్యవసరంలో ఉన్న వారికి, తలసేమియా చిన్నారులకు సమయానికి రక్తాన్ని సరఫరా చేయడం, ఉచిత రక్త మార్పిడి, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడుతున్న రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో మహారాణిపేట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులను గమనించారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందుతున్న సేవల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తలసేమియా కేంద్రాన్ని సందర్శించిన ఆయన వ్యాధితో బాధతపడుతున్న చిన్నారులను పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వై.ఎస్ శివ నాగేంద్ర రెడ్డి, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా ఛైర్మన్ టి.ఆర్.మక్సూద్ అహ్మద్, ప్రతినిధులు, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు

ప్రజాశక్తి -కొత్తకోట:ప్రభుత్వ స్థలాలలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కొత్తకోట పంచాయతీ ఈవో జ్యోతేశ్వర్ రెడ్డి, విఆర్ వో సుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంకు ఎదురుగా అయ్యప్ప నగర్‌లో ఆర్ అండ్ బి రోడ్డుకు అనుకొని వున్న ప్రభుత్వ స్థలాన్ని దొడ్డ ప్రభాకరరావు అనే వ్యక్తి కబ్జా చేయడంతో పాటు రహదారిలో షాపులు నిర్మించడానికి పనులు ప్రారంభించాడు. దీనిపై స్థానికులు అడ్డు చెప్పడంతో పాటు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈఓ జ్యోతిశ్వర రెడ్డి, విఆర్‌వో సుబ్బయ్య, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీ పూడి దేవ గ్రామ పెద్దలు కలిసి సంఘటన స్థలానికి చేరుకొని నిర్మాణ పనులు పరిశీలించి సర్వే చేయించారు. సర్వే నెంబర్ 127/2 లో 9 సెంట్లు ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. ఇది ప్రభుత్వ స్థలమని ఇక్కడ ఏ నిర్మాణాలు జరపకూ డదని స్పష్టం చేశారు.ఎవరైనా సరే ఇటువంటి నిర్మాణాలు చేపడితే తగు చర్యలు తప్పవని ప్రభాకర రావు ను మంద లించారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ స్థలము ఎక్కడ ఉన్నా వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.గ్రామంలో చాలావరకు ప్రభుత్వ స్థలాలు ఆ క్రమంలో ఉన్నాయని వాటిని గుర్తిస్తామని తెలిపారు. త్వరలో గ్రామసభ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామని, స్థానిక పంచాయతీ అనుమతులు తప్పనిసరని ఈ వో స్పష్టం చేశారు.



పనులు అడ్డగించిన అధికారులు



ఫోన్ వెలుగులతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

సెల్ ఫోన్ వెలుగులో విధులు

ప్రజాశక్తి -కోటవురట్ల: నిత్యం వివిధ పనులతో సిబ్బంది రద్దీగా ఉండే తహసిల్దార్ కార్యాలయానికి విద్యుత్తు అంతరాయం ఏర్పడితే ఇన్వర్టర్ సౌకర్యం లేక సెల్ ఫోన్ వెలుగులతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది, గడిచిన రెండు మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఎదుర్కోవలసి రావడంతో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో ఇన్వెర్టర్ బ్యాటరీలు సక్రమంగా పనిచేయక నిరుపయోగంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులకు అంతరాయం ఏర్పడుతుందని పలువురు ఆవేదన సైతం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనులపై రైతులతో కార్యాలయం రద్దీగా దర్శనమిస్తుంది. అధికారులు స్పందించి ఇన్వెర్టర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు.



షరీఫ్‌ను అభినందిస్తున్న నజిరుద్దిన్

షరీఫ్‌కు అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం: మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మహమ్మద్ అహ్మద్ షరీఫ్ (ఎంఎ షరీఫ్)ను వైజాగ్ ఫుడ్స్ డైరెక్టర్ మహమ్మద్ నజిరుద్దిన్ కలిసి అభినందనలు తెలిపారు. క్యాబినెట్ హోదాతో నియమితులైన శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌ను నజిరుద్దిన్ శాలువకప్పి సత్కరించారు.

రహదారులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతపల్లి : మండల కేంద్రంలోని ప్రశాంతినగర్ వీధిలో సిమెంట్ రహదారి నిర్మాణానికి ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతల శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు.